# పునర్జన్మ

ఇవాళ ఓ ముఖ్యమైన పనిమీద ఈ గోదావరి కాలువ దగ్గరి కొచ్చాను. ఈ కాలువ మీద వంతెన. అది దాటి రోడ్డెక్కి అలా తిన్నగా వెళ్ళిపోతే కొత్తపేట వస్తుంది. నాకు కొత్తపేటలో పనిలేదు. నాకు ఈ కాలవతోనే పని. ఆత్మహత్య. చడి చప్పుడు లేకుండా తన మానానా తను వెళ్లిపోతున్న ఈ గోదార్లో మునిగి ఆత్మహత్య చేసుకోవాలి.

మెట్లు, ఇసక ఆ తర్వాత నీళ్ళు. ముందు మెట్లు దిగుతున్నాను. పూర్తిగా మెట్లు దిగాకా కుడివైపుకి వెళ్తే గుబురుగా ఉన్న పొదలు, నాగజెముడు, బ్రహ్మజెముడు, పొట్టిగా ఉన్న తాటిచెట్లు ఈతచెట్లు తెల్లపూల పొదలు. గుబురుగా ఉంటాయి. వాటి వెనక్కాల ఏం చేసినా ఎవరికీ కనపడదు. సరిగ్గా అక్కడే లావుగా ఉన్న వంతెన స్థంభం అడ్డొస్తుంది. ఆ స్థంభం దగ్గరే గోదావరి వయ్యారంగా వంపు తిరుగుతుంది. ఈ రెండూ నాకు చాలా నచ్చాయి. ఐడియల్ ప్లేస్.

మెట్లు మొదలయ్యే దగ్గర ఓ పెద్దరావి చెట్టుంది. సాధారణంగా పొద్దున్న టైములో రావుల పాలెం వెళ్ళేవాళ్ళు, అరటి గెలలున్న సైకిళ్ళని ఆపుకుని, అక్కడ బుచ్చాయమ్మ యిచ్చే కాఫీనీళ్ళు గొంతులో పోసుకుని వెళ్తుంటారు. సాయంత్రం కుర్రగాంగ్ సినిమా కబుర్లు చెప్పుకోడానికి అక్కడ చెట్టుకింద కూచుని పెసర పుణుకులు జీడికడ్డీలు తింటూ కాలం గడిపేస్తారు. మధ్యాహ్నం ఎవరూ ఉండరు.

అందుకే ఈ టైముని ఎన్నుకున్నాను.

మెట్లు దిగుతూ నీళ్ళవైపు చూసాను. తెరచాపలేని ఓ పడవ, ఆ పిల్లగాలికే, సునాయాసంగా నీటిమీద జారిపోతోంది.

గబుక్కున 'క్రాసింగ్ బ్రూక్‌లీన్ ఫెరి' గుర్తొచ్చింది. వచ్చిన పని మర్చిపోతానేమోనని 'విట్‌మాన్' ఆలోచనల్ని పక్కకి నెట్టేసాను. నీళ్ల లోతుని ఊహించుకుంటూ మెట్లు దిగుతున్నాను.

ఆత్మహత్య గుర్తుకు రాగానే గుండె గబగబా కొట్టుకోడం మొదలెట్టింది. ఊపిరి నెమ్మదిగా తీస్తూ నీళ్లకింద ఉన్న మరోలోకాన్ని గురించి ఆలోచిస్తూ నీళ్ళకేసి చూసాను. కాలవ అంచునున్న కొబ్బరి చెట్లు నీళ్ళల్లో ముదురాకు పచ్చరంగులోనూ నల్లరంగులోనూ కదుల్తున్నాయి.

సాగిపోతున్న గోదారిపాయని చూసి వేస్ట్‌లాండ్‌లోని థేంస్‌నదిని తల్చుకోబోతున్న మనసుని మందలించాను. ఛావడాని తగిన మనోబలం ఉండాలంటే ఇలియట్‌ని స్పెన్సర్‌ని తలుచుకోకూడదు.

ఇప్పుడు బలం కావాలి. నా ప్రయత్నానికి ఏ విధమైన ఆటంకం ఉండకూడదు. ఈ ప్రపంచంలోని ఏశక్తికూడా నా నిర్ణయాన్ని మార్చలేవు. ఈ క్షణం కూడా అంతే. దృఢమైన మనసుతో మరో రెండు మెట్లుదిగాను.

కాళ్ళకింద ఎండిపోయిన రావి ఆకులు మెల్లగా గుసగుసలాడుతున్నాయి. నేను వినిపించుకోదల్చుకోలేదు. ఒక్కసారి ఆగానంటే వాటిగోడుని వినిపిస్తాయి. నా ఆత్మహత్యని మర్చిపోతాను.

మరో మెట్టుదిగాను. కాళ్ళకి తడి, యిసుక, రెండూ అంటుకుంటున్నాయి. ఇంకా పది మెట్లున్నాయి. ఆ తర్వాత మట్టి.

ఆ తర్వాత కాలవ. ఏదో పాకినట్లనిపిస్తే కిందకి చూసాను. రెండు నల్లగండు చీమలు. నా చిటికిన వేలుతో ముచ్చట్లు చెప్పుకుంటున్నాయి. జాగ్రత్తగా ఆ రెండింటిని రావి ఆకు కాడతో కిందికి తోసాను. అక్కడున్న చీమల్తో కలిసిపోయాయి. సగంసగం నానిన ఆకుల్ని తోసుకుంటూ ఒకదాని వెనక్కాల ఒకటి చాలా ఒబ్బిడిగా డిసిప్లీన్‌డ్‌గా వెళ్ళిపోతున్నాయి.

ఎంత ఉత్సాహం ఆ చిన్న ప్రాణాల్లో? నా ఆరడుగు విగ్రహంలో పూర్తిగా నిరుత్సాహం. బతకాలన్న కోరికే పోయింది.

నేనెందుకిలా అయ్యాను? కనక మహాలక్ష్మి. నా ప్రేమని నిలువునా తిరస్కరించింది. నేనెలా బతకాలి? ఈ పగిలిపోయిన హృదయంతో మాములు మనిషిని అవగలనా! అవలేను కాబట్టి మరణం శరణం. ఎంత ఊహించున్నాను! బ్రైడల్ పాటలు రాసెద్దామనకున్నాను. స్పెన్సర్ రాసినట్లుగా ఓ పెద్దకావ్యం ఎపిథెలామియాన్

లాటిది రాసి కనక మహాలక్ష్మికే అంకితం చేద్దామనకున్నాను. కానీ...ఎంతల్లాగా అవమాన పర్చింది. "నీ యింగ్లీషు లిటరేచర్ దేనికి పనికొస్తుంది? కబుర్లు చెప్పుకోడానికి. అయినా నువ్వు ఒక్క స్నేహితుడివి మాత్రమే. భర్తగా ఎలా నా జీవితంలోకి నిన్ను ఊహించుకుంటాను? నేను అమెరికా వెళ్ళాలి? అలాంటి మొగుణ్ణే మావాళ్లు తెస్తారు. అయినా నువ్వు నావైపు నుంచి కూడా ఆలోచించు"అంటూ అవమాన పరిచింది.

ఛీ, ఎందుకీ జీవితం? అవమానంతో బతికే కన్నా ఛస్తే నయం. ఈ బంధాలు, బంధువులు, అనుబంధాలు అంతా ట్రాష్. కాలవ కెళ్ళి ఈత కొట్టి వస్తాను అని యింట్లో చెప్పాను. కాలవలో చచ్చిపోదామని మనసులోనే అనుకున్నాను.

మెట్లు పూర్తిగా దిగి తాటి తోపువైపు వెళ్ళాను. అక్కణ్ణించి నీళ్ళల్లో దిగిపోవడం ఎవరికీ కనబడదు.

కాళ్లకింద మెత్త యిసుక. అడుగులు ఎత్తిఎత్తి బరువుగా వేస్తున్నాను. కాళ్ళకి నీళ్ళు చల్లగా మెల్లకా తాకాయి. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది. కాస్సేపయితే, ఆ నీళ్ళకిందకి వెళ్ళిపోతాను. అక్కడ ఎవరికీ ఏ మహర్షికీ, ఏ మహాయోగికి అంతు పట్టని ప్రపంచం ఉంటుంది.

నిశ్శబ్దంగా సాగుతున్న నీళ్ళకింద మరో నిశ్శబ్ధ ప్రపంచం. అలాగే నీళ్ళకేసి చూస్తుండిపోయాను.

కాళ్ళని ఎవరో మెత్తగా తాకుతున్నట్లనిపించింది. భయపడ్డాను. బాగా వొంగి నీళ్ళల్లోకి తొంగి చూసాను. చేపలు. నీటి పొరల కింద ఎంతో ఉత్సాహంగా, వయ్యారంగా, తోకలాపుకుంటూ వెళ్ళిపోతున్నాయి. అదృష్టజీవులు. బాధల్లేవు. ఫీలింగ్స్ లేవు. సృష్టిలో అన్ని ప్రాణులు సమానం కావు. దేవుడు పక్షపాతం చూపించాడు. అసలు దేవుడికే హృదయంలేదు. నాకింత వైరాగ్యం! వాటి కంత ఉత్సాహం! హుఁ...

నీళ్ళ తెరమీద నీలాకాశం, ఊగుతున్న చెట్లు కనపడ్తున్నాయి. ఆకాశం కొలతల్ని తీసుకుని సరిగ్గా కుదించి. నీళ్ళమీద దింపినట్లుగా ఉంది. నీలంరంగు బ్రష్ని బాగా కడిగేసి విదిల్చినంత లేత నీలం రంగులో ఉంది ఆకాశం. ఈ ఆకాశాన్ని ఒక్కసారి ముట్టుకుంటే... ఒంగి చూపుడు వేలుని నీటిపైన ఉంచాను.

ఒక్కసారిగా గుండ్రటి తరంగాలు లేచి దూరందూరంగా వెళ్ళడం మొదలెట్టాయి. ఆ పల్చటి నీటి పొరల కింద నా తెల్లటి పాదాలు కనిపిస్తున్నాయి.

రెండు రావి ఆకులు, తలని, వెంటనే బుజాన్ని చిన్నగా ముద్దు పెట్టుకుంటూ రాలిపోయాయి.

ఆకు తాకిడికి పైకి చూసాను. గలగలా కదుల్తున్న ఆకులు, వాటి పొడవాటి కాడల కోణాల్లోంచి సన్నగా దిగుతున్నాయి సూర్యకిరణాలు. ఒక్కసారిగా కోల్‌రిడ్జ్, వర్డ్స్ వర్త్ నన్నావరిస్తున్నట్లుగా అనిపించింది.

వచ్చిన పని మర్చిపోతున్నాను. ఉహుం...నన్నీ ప్రకృతి ఏం చెయ్యలేదు. మరో రెండడుగులు నీళ్ళల్లోకి...

కాలికింద యిసక మెత్తగా తగిలి, మెల్లిగా కరుగుతూ, జారుతూ నా కాలివేళ్ళతో ఏదో అనేస్తోంది. నా కవి హృదయం ములిగింది. ఆ మెత్తటి యిసకని కాలదన్ని మరో రెండడుగులు లోపలికి...

ఒక్క రవ్వ జారాను. గబుక్కున రెండు చేతులు, రెండు వైపులా చాపి నన్ను నేను బాలెన్స్ చేసుకున్నాను.

ఎందుకు బాలెన్స్ చేసుకున్నాను నీళ్ళల్లో దూకి చావడానికి వచ్చి ఆ నీళ్ళల్లోనే జారతానని భయపడ్డాను. ఛావంటే భయమా! ఉహూ...నాకేం భయంలేదు. తలముంచాను. యింకా కిందికి వెళ్ళాను. తెలీని ప్రపంచం. మూగ ప్రపంచం. నల్లగా కనపడ్తున్న మరో ప్రపంచం.

కదుల్తున్నాను. నెమ్మదిగా తేలుతున్నట్లుగా అనిపిస్తోంది. నా శరీరం కింద తొందరలేని ప్రపంచం. అందుకే నా కదలికలన్నీ కూడా మెల్లిగా, స్లో మోషన్‌లో ఉన్నాయి.

సన్నటి బుడగల సవ్వడి లీలగా వినపడ్తోంది. నెలరోజుల్నించి పెంచిన జుట్టు రాహుల్ దేవ్ జుట్టులా ఉంగరాలు తిరిగి ఉంది. మెడ్యూసా జుట్టులా ఉందని నిన్ననే అద్దంలో చూసినప్పుడు అనిపించింది. మెడ్యూసా జుట్టుని చూసి చేతనత్వం కోల్పోయినట్లుగానే, నన్ను, నా జుట్టునిచూసి, గబుక్కున గుర్తుపట్టి, నేను ఎక్కడ తేలితే అక్కడ స్టన్నయిపోతారు.

అలాగే వెళ్ళిపోతున్నాను. ఎటో! ఎంతసేపో!

పారుతున్న ఆ పవిత్ర గోదావరిలో అన్నీ కడుక్కుని పోతున్నాయి. మురికి పట్టిన మనసు, ఆ నీళ్ళతో పాటూ కాస్తదూరం వెళ్ళి స్వచ్ఛంగా, శుభ్రంగా అయిపోయింది. బుర్రలో ఉన్న దుమ్ము, ధూళి నీళ్ళల్లో కొట్టుకుపోయాయి.

అంత వరకూ నాలో ఉన్న భావాలు, ఊహలు, ఆవేశం, కసి, నిస్సహాయత్వం అన్నీ కూడా ప్రవహించే గోదార్లో కలిసిపోయాయి.

కదుల్తున్న నీళ్ళల్లోంచి, ఏవో శబ్దాలు వింతగా వినపడ్తున్నాయి. ఎంత సేపు అలా ఉన్నానో నాకే తెలీదు. ఏ స్థితిలో ఉన్నానో నాకే అంతుపట్టలేదు.

ఒక్కసారిగా పైకి తేలాను. ఏఁవిటిది? ఎక్కడ మునిగానో అక్కడే తేలాను. ఇది ఇందాక నేను చూసిన పరిసరాలేనా! ఈ లోకం ఇందాకటి లోకమేనా! ఇందాకా యిలా ఉన్నట్లు లేదే! మరి నేను ఆత్మహత్య...చేసుకోలేదూ...ఎంత ఫూల్‌ని...ఇడియట్‌ని... నాకు ఈత వచ్చు అన్న సంగతి మర్చిపోయాను. షిట్...

కానీ...యిప్పుడు నా మనసు నాకు కొత్తగా అనిపించింది.

ఆత్మహత్య చేసుకోవాలన్ని పిచ్చి ఆలోచనల్ని, పరిపక్వతలేని, పరిణతి లేని, ఎదగని ఊహల్ని నీళ్ళల్లో నిమజ్జనం చేసాను.

ఆవేశాన్ని, దానివెంటనంటి ఉన్న అనర్థాన్ని నీళ్ళు లాక్కెళ్ళిపోయాయి.

అదే దారిలో, తాటి తోపులోంచి బయటికొచ్చి మెట్లెక్కుతున్నాను. ప్రతీ అణువులో ఉత్సాహం.

తడిసిన ఒంటిని సూరీడు వెచ్చగా స్పృశిస్తున్నాడు. ఏదో ప్రపంచంలోంచి వచ్చాను. నా ఒరిజినల్ ప్రపంచంలోకి వచ్చాను.

గూడులోంచి, కుకూన్‌లోంచి బయటికొచ్చిన సీతాకోక చిలుకలా పంచరంగుల ఊహల్తో, కొత్తగా వచ్చిన రెక్కల్తో బయటికొచ్చాను.

అమ్మ కడుపులోంచి, ఈ లోకంలోకి వచ్చిన పసిపాపలా ఫీల్ అయాను. మళ్ళా పుట్టాను మరోసారి పుట్టాను.

జీవితం అంటే కనకమహాలక్ష్మికాదు...యింకేదో అని యిప్పుడు తెలిసింది. జీవితానికి కొత్త అర్థం నీటి ప్రవాహాన్ని చూస్తుంటే తెలిసింది. అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. ఏం జరిగినా, ఎంత జరిగినా ఏం జరగనట్లుగా అలా కదులుతూండాలని. కనకమహాలక్ష్మి కాకపోతే మరో వెంకటలక్ష్మి...మనసు తేలికైంది. దూది పింజలా మారిపోయింది.

ఆ తర్వాత ఎప్పుడైనా మనసు బాగాలేకపోతే, మా ఊరు వెళ్ళి, ఆ గోదావరి కాలవలో ఓ గంటో, రెండుగంటలో ఈతకొట్టే మరో కొత్త మనిషిని అయ్యేవాడిని. మరో జన్మవచ్చినట్లుగా, కొత్తగా అనిపించేది. అయితే సెన్సిటివ్‌గా ఉండే నాకు ఆ అవసరం చాలాసార్లు వచ్చింది అని వేరే చెప్పక్కర్లేదు.

✧ ఆగష్టు, **2005** రచన మాసపత్రిక ✧